# కర్ణపర్వ కథాంశాలు

కర్ణపర్వమున 96 అధ్యాయములు, 5175 శ్లోకములు గలవు. ద్రోణాచార్యుడు మరణించిన తరువాత నిరుత్సాహుడైన దుర్యోధనుడు, ఇతర రాజులు ద్రోణపుత్రుడగు అశ్వత్థామ వద్దకు వెళ్లి దుఃఖిస్తున్న అతనిని ఓదార్చి సంధ్యాకాలమున తమ తమ శిబిరములకు వెడలిరి. దుర్యోధనుడు కర్ణుని సేనాపతిని చేసెను. పాండవులు ప్రాతఃకాలమున తమ నిత్యక్రియలు పూర్తిచేసుకొని యుద్ధక్షేత్రమునకు బయలుదేరిరి. కౌరవపాండవుల మధ్య ఘోరయుద్ధము జరిగెను. ధృతరాష్ట్రపుత్రులు చూస్తూండగానే అర్జునుడు కర్ణుని వధించెను. జరిగిన వృత్తాంతమంతయు సంజయుడు ధృతరాష్ట్రునికి వినిపించెను.

ఉద్విగ్నమనస్కుడైన సంజయుడు ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లి నమస్కరించెను. భీష్మద్రోణుల మరణముచే ధృతరాష్ట్రుడు మిక్కిలి విచారించుచుండెను. ధృతరాష్ట్రుడు యుద్ధవృత్తాంతమును విపులముగ వినదలచెను. సంజయుడు రాజా! దైవికమగు సంఘటనను తలచుకొని బాధపడవలదు. మహాధనుర్ధారియగు ద్రోణాచార్యుని మరణము తరువాత నీ పుత్రులు విషణ్ణవదనులైరి. వారు దుఃఖించుటను చూచి సైనికులు కూడా భయమునొందిరి. ఆ సమయమున అనేక అపశకునములు కలిగెను.

ద్రోణాచార్యుడు చంపబడగా కౌరవసేన చెల్లాచెదరుకాగా దుర్యోధనుడు అతికష్టంతో వారిని నిలుపుచేసెను. సాయంకాలంకాగానే కౌరవులు తమ సేనలతో శిబిరములకు చేరి తదుపరి కర్తవ్యం గురించి చర్చించుకొనిరి. దుర్యోధనుడు యుద్ధవ్యూహమును గూర్చి అడుగగా అశ్వత్థామ దుర్యోధనా! పండితులు రాజుకోరిన దానిని పొందుటకు నాల్గు ఉపాయములు చెప్పిరి. రాగము (సైనికుల స్వామిభక్తి), యోగము (సాధన సంపత్తి), దక్షత, నీతి. కాని ఈ నాల్గుఉపాయములు ప్రారబ్ధమునకధీనములు. మన పక్షమున పరాక్రమవంతులగు చాలామంది వీరులు మరణించిరి. అయినప్పటికి విజయంపై ఆశను విడువకూడదు. నీతిపూర్వకముగ చేయుపనివలన ప్రారబ్ధముకూడా మనకు అనుకూలమగును. సర్వగుణసంపన్నుడగు కర్ణుని సేనాపతిగచేసి శత్రువులను తుదముట్టించెదమని పలికెను. గురుపుత్రుడు అశ్వత్థామ యొక్క హితోక్తులను విని దుర్యోధనుడు కర్ణునితో రాధేయా! ముందుగా భీష్మద్రోణులు సేనాపతులైరి. కాని వారు వార్ధక్యము, అర్జునుని యెడల

రక్షాభావము కారణముగ యుద్ధమున చంపబడిరి. నీవు వారికంటే శక్తిశాలివి అగుటచే సేనాపతి పదవిని స్వీకరింపుము. భీష్ముడు పాండవులను పౌత్రులను భావనతో పదిరోజులవరకు
మహాయుద్ధమున వారిని రక్షించెను. ద్రోణాచార్యుడు కూడా శిష్యులను భావనతో పాండవులను రక్షించెను. నీవు సైన్యమును ముందుకు నడిపించుటకు సర్వసమర్ధుడ వని పలికెను.

ఉత్సాహమును ద్విగుణీకృతము చేసెడి దుర్యోధనుని మాటలు విని కర్ణుడు మహారాజా! మనం ఒంటరిగా శ్రీకృష్ణునితో సహా పాండవుల నందరిని జయించగలమని నేను ముందే చెప్పితినని పలుకగా దుర్యోధనుడు సంతుష్టుడై కర్ణుని సేనాపతి పదవియందు అభిషిక్తుని చేసెను. సంజయుడు ధృతరాష్ట్రునితో మహారాజా! కర్ణుడు సేనాపతి పదవిని స్వీకరించి ఉదయముననే సైనికులందరిని యుద్ధమునకు సిద్ధముగానుండమని ఆదేశించి మకరవ్యూహంద్వారా పాండవులను ఓడించవలెనని కోరికతో బయలుదేరెను. మకరవ్యూహము ముఖభాగమున కర్ణుడు, నేత్రస్థానమున శకుని, ఉలూకుడు, శిరోభాగమున అశ్వత్థామ, కంఠభాగమున దుర్యోధనసోదరులు, ఉదరస్థానమున సేనతో కూడి దుర్యోధనుడు, కుడికాలు దగ్గర కృతవర్మ, ఎడమకాలు వద్ద కృపాచార్యుడు, రెండుకాళ్ల వెనుకభాగమున శల్యసుషేణులు, పుచ్ఛభాగమున చిత్రసేనాదులు నిలబడిరి.

కౌరవ సేనాపతి కర్ణుడు రచించిన వ్యూహమును చూచి యుధిష్ఠిరుడు అర్జునునితో పార్థా! కౌరవవీరులలో కర్ణుడు మాత్రము మిగిలియుండుటచే కౌరవసేన నిరుత్సాహముతోనున్నది. కర్ణవధ జరిగినచో ఇక మన విజయము నిశ్చితమే. కనుక వ్యూహరచన చేసి విజయుడవు అయి వనవాసదుఃఖమును పోగొట్టుమని చెప్పెను. అగ్రజుని మాటలను శిరసావహించి అర్జునుడు తన సేనకు అర్ధచంద్రవ్యూహము రచించెను. ఈ వ్యూహము కుడిప్రక్క భీమసేనుడు, ఎడమవైపున ధృష్టద్యుమ్నుడు, మధ్యభాగమున అర్జునుడు, పృష్ఠభాగమున యుధిష్ఠిర నకుల సహదేవులు నిలబడిరి. ఈ విధముగ వ్యూహరచన జరిగి ఇరుపక్షములమధ్య ఘోరయుద్ధము జరిగెను. భీమసేనుడు ఏనుగునెక్కి తోమర, పాశములను ధరించి శత్రుసేనను బాధించసాగెను. భీమసేనుని చూచి గజారూఢుడైన క్షేమధూర్తి అతనివైపు మరలెను. ఇద్దరిమధ్య జరిగిన

యుద్ధమున ఇరువురి ఏనుగులు మరణించినవి. చివరకు భీముడు అతనిని చంపివేసెను. కర్ణుడు తీక్షణ బాణములతో పాండవసేనను చెల్లాచెదరు చేయసాగెను. పాండవులుకూడా కర్ణుని సమక్షముననే కౌరవసేనను నాశముచేయసాగిరి. నకులుడు కర్ణునితో, భీమసేనుడు అశ్వత్థామతో, సాత్యకి విందా అనువిందులతో, యుధిష్ఠిరుడు కృపాచార్యునితో, శిఖండి కృతవర్మతో, సహదేవుడు దుశ్శాసనునితో యుద్ధము చేయసాగిరి. సాత్యకి వింద, అనువిందుల సైన్యమును నాశము చేసెను.

ప్రతివింధ్య చిత్రసేనుల మధ్య ద్వంద్వయుద్ధము జరిగెను. ప్రతివింధ్యుని తోమరప్రహారమునకు చిత్రసేనుడు రథమునుండి క్రిందపడి ప్రాణములను విడిచెను. చిత్రసేనుని మరణంతో కౌరవసేన పారిపోయెను.

అశ్వత్థామ భీమసేనునితో యుద్ధము చేసెను. ఇరువురు బాణవర్షంతో ఒకరినొకరు గాయపరచుకొనిరి. వారి యుద్ధమునకు దేవతలుకూడా ఆశ్చర్యపోయిరి. యుద్ధరంగమున అలసిసొమ్మసిల్లిన ఇద్దరిని రథసారథులు సురక్షిత స్థానమునకు తీసుకువెళ్ళిరి.

అర్జునుడు సంశప్తకసైన్యమును ధ్వంసముచేయుటను చూచి గంధర్వాదులు అతనిని స్తుతించిరి. అశ్వత్థామకు అర్జునునితో యుద్ధముచేయవలెనని కోరిక కలిగి అర్జునుని తనతో యుద్ధమునకు ప్రేరేపించగా సంశప్తకులను విడిచి అర్జునుడు అశ్వత్థామతో తలపడెను. అశ్వత్థామ ప్రయోగించిన దివ్యాస్త్రములను అర్జునుడు తన దివ్యాస్త్రములతో నివారించెను. కాని అర్జునుని బాణములతో నిరుత్సాహపడిన అశ్వత్థామ అర్జునునితో యుద్ధము చేయక కర్ణుని సేనయందు ప్రవేశించెను.

నకులుడు ఎంతో చాతుర్యంతో కర్ణునితో యుద్ధముచేసెను. కర్ణుడు పాండవసేనను ధ్వంసము చేయగా నకులుడు కౌరవసేనను నాశనముగావించెను. కర్ణుడు నకులుని ధనుస్సువిరగ్గొట్టి సారథిని చంపివేసెను. అతనిని పట్టుకొని కర్ణుడు బలవంతులగు కౌరవులతో యుద్ధముచేయకుము. శిబిరానికి వెళ్ళి కృష్ణార్జునులతో నుండుమని చెప్పి కుంతికిచ్చిన మాటను స్మరించి పరాజితుడగు నకులుని విడిచిపెట్టెను.

దండధారుడు కౌరవసేనను చిందరవందర చేయుచుండగా శ్రీకృష్ణుడు రథమును అతనివైపు తీసుకొని వెళ్ళుచు దండధారుని చంపి పిమ్మట సంశప్తక రాజులను చంపమని అర్జునుని ఆదేశించెను. భగవంతుని

ఆజ్ఞ ననుసరించి అర్జునుడు దండధారునితో భీషణయుద్ధముగావించి బాణప్రహారముతో అతనిశిరస్సు ఖండించెను. మరల అర్జునుడు సంశప్తకులతో తలపడెను. శ్రీకృష్ణుని ఆదేశము ప్రకారము తీక్షణశస్త్రములను ప్రయోగించి సంశప్తకులను నాశనము చేసెను.

ఇరు పక్షములమధ్య భీషణ యుద్ధము జరిగెను. దుర్యోధన యుధిష్ఠిరుల ద్వంద్వయుద్ధముగూడా ఆశ్చర్యముగొలుపునదే. దుర్యోధనుడు శక్తిని ప్రయోగించగా యుధిష్ఠిరుడు దానిని నివారించి తీక్షణబాణములతో అతనిని బాధించెను. దుర్యోధనుడు గదాప్రహారము చేయగా పీడింపబడిన యుధిష్ఠిరుడు శక్తిని ప్రయోగించెను. దానివలన దుర్యోధనుడు నేలపైబడి మూర్ఛపోయెను. కృతవర్మ దుర్యోధనుని యుద్ధభూమి నుండి శిబిరమునకు తీసుకొనిపోయెను.

ఈ విధముగ కర్ణుని ఆధిపత్యంలో దుర్యోధన, కృపాచార్య, దుశ్శాసనాదులకు సాత్యకి, భీమ, ధనంజయులతో గగుర్పాటుగొలిపించు యుద్ధము జరిగెను. సంధ్యాసమయమున ఇరుపక్షములవారు తమ తమ శిబిరములకు వెడలిరి.

రాత్రి సైన్యమునిద్రించు సమయమున కౌరవులు ఒకచోట సమావేశమై తదుపరి కర్తవ్యమును గూర్చి చర్చించిరి. కర్ణుడు వారితో ఇట్లు చెప్పెను. "అర్జునుడు స్వభావముచే ధైర్య,పరాక్రమ సంపన్నుడు. దానికితోడు శ్రీకృష్ణుడు అతనికి మార్గదర్శకుడు. కనుక అర్జునుడు ఊహించనిరీతిలో అస్త్రప్రయోగముచేసి మనల్ని వంచించినాడు. రాజా! నేను రేపు అతని ఆలోచనలనన్నికటిని వమ్ముచేసెదను." కర్ణుని మాటలకు దుర్యోధనుడు మిక్కిలి సంతోషించి అందరిని తమ తమ శిబిరములకు వెళ్లి విశ్రాంతి తీసుకొమ్మని సూచించెను. తెల్లవారగానే కర్ణుడు దుర్యోధనుని వద్దకు వెళ్లి అతనితో మిత్రమా! మనము ఈ రోజు అర్జునునితో యుద్ధము చేసెదము. అర్జునుని చంపియే యుద్ధక్షేత్రమునుండి తిరిగి వచ్చెదము. మద్రరాజగు శల్యుడు నాకు రథసారథి అయినచో మన విజయము నిశ్చితమే. కనుక మీరు శల్యుని ప్రార్థించవలసినదని చెప్పగా దుర్యోధనుడు శల్యుని వద్దకు వెళ్లి కర్ణునికి రథసారథి కావలసినదని కోరెను.

దుర్యోధనుని ప్రస్తావనను విని శల్యుడు రాజా! నీవు మమ్ములను అవమానము చేయుచున్నావు. నేను కర్ణుని లెక్కపెట్టను. అతడు

మనవంటివీరుడు కాదు. నేను సూతపుత్రునికి రథసారథి ఎన్నటికి కాలేను. యుద్ధమును విడిచి ఈరోజే నాదేశమునకు వెడలిపోయెదనని చెప్పెను. శల్యుని కోపమును గమనించి దుర్యోధనుడు శాంతభావముతో ఇట్లు నివేదించెను. రాజా! మీ పరాక్రమము, గొప్పతనము అందరికి తెలుసు. కాని కర్ణుని రక్షించుటకు, నాకు విజయము చేకూరుటకు నాకోరికను మన్నించండి. మీరు కర్ణునికంటే గొప్పబలశాలులు. అశ్వవిద్యయందు శ్రీకృష్ణుని కంటే శ్రేష్ఠులు. దుర్యోధనుని సమయోచిత వచనములకు ప్రసన్నుడైన శల్యుడు రాజా! మీరు చెప్పుటవలన కర్ణునికి రథసారథ్యమును స్వీకరించుచున్నాను. కాని యుద్ధమున కర్ణుని హితముకోరి పరుషవచనములు మాట్లాడినను వాటినన్నిటిని నీవు, కర్ణుడు సహించవలెనని చెప్పెను. దీనికి అంగీకరించిన దుర్యోధనుడు కర్ణుని వద్దకు వచ్చి శల్యుడు శ్రీకృష్ణుని కంటే చతురుడు. అతడు నీకు రథసారథ్యమునకై అంగీకరించినాడని తెలియజేసెను.

ఈ విధముగా శల్యుడు సారథ్యము స్వీకరించిన తరువాత యుద్ధక్షేత్రమున ఐకమత్యములేకపోవుటచే కర్ణశల్యులమధ్య సంవాదము జరుగుచుండెను. కర్ణుడు ఆత్మ ప్రశంస చేసుకొనుచూ ఈరోజు నేను అర్జునుని చంపగలను. పాండవులు పరాజితులగుదురు. దుర్యోధనునకు విజయము చేకూరగలదని కొనియాడెను. ఈ విధముగ కర్ణశల్యులమధ్య అనైక్యము క్షణక్షణము వ్యక్తమయ్యెను.

యుద్ధము ప్రారంభం కాగానే భీముడు కౌరవసేనను ఎక్కువగా నష్టపరచెను. ఇంతలో కర్ణుడు అక్కడకు వచ్చి భీమునితో తలపడెను. అతడు తీవ్రబాణములతో భీముని బాధించెను. క్రుద్ధుడైన భీముడు పర్వతములను భేదించు శక్తిగల బాణములను కర్ణునిపై ప్రయోగించగా అతడు స్పృహతప్పి రథము వెనుక భాగమున కూర్చుండి పోయెను. సారథి కర్ణుని సురక్షిత ప్రదేశమునకు తీసుకొనిపోయెను.

దుర్యోధనుడు తనసైన్యమును ఉత్సాహపరుస్తూ ఇట్లు పలికెను. సైనికులారా! భాగ్యవశముచే యుద్ధము యొక్క అవసరము మనకు వచ్చినది. స్వర్గద్వారములు తెరచియున్నవి. మీరు శత్రువులపై విజయము పొందిన నిష్కంటకమగు పృథివిని పొందెదరు. శత్రువులచేతిలో మృత్యువుపాలైన స్వర్గమును పొందెదరు. అశ్వత్థామ శస్త్రత్యాగము చేసిన నాతండ్రిని పాండవసేనానాయకుడగు ధృష్టద్యుమ్నుడు చంపినాడు. కనుక

ధృష్టద్యుమ్నుని చంపితీరెదనని ప్రతిజ్ఞచేసెను. ఇరుసేనలు తలపడినవి. అర్జునుడు అశ్వత్థామను జయించిన పిమ్మట యుధిష్ఠిరుడు కనబడక పోవుసరికి చింతాక్రాంతుడై వాసుదేవునితో కృష్ణా! ధర్మరాజు కనిపించుటలేదు. కౌరవులలో ఎవ్వరూ ప్రస్తుతం నాతో యుద్ధము చేయుటకు వచ్చుట లేదు. కనుక మీరు ధర్మరాజు వద్దకు రథమును తీసుకొనివెళ్లుడు. వారిని చూచిన పిమ్మట యుద్ధము చేసెదనని పలుకగా శ్రీకృష్ణుడు యుధిష్ఠిర దుర్యోధనులు యుద్ధము చేయు ప్రదేశమునకు రథమును తీసుకొనివెళ్లెను. దుర్యోధనుడు ఓడిపోవు పరిస్థితిలో ఉండగా కర్ణుడు అక్కడకు చేరికొని అతనిని రక్షించెను. కర్ణుడు పాండవులసేనను నష్టపరచెను. కర్ణుడు యుధిష్ఠిరుని గాయపరచగా అతడు అస్వస్థుడాయెను. ఇంతలో భీమదుర్యోధనుల మధ్య యుద్ధము సాగెను. భీముని పరాక్రమును ముందు నిలబడలేక దుర్యోధనుని పరిస్థితి దయనీయమాయెను. శల్యుడు కర్ణునితో రాధేయా! మీరు యుధిష్ఠిరునితో తలపడెవలనని కోరుచున్నారా? లేక అర్జునునితోనా? అర్జునునితో యుద్ధము చేసి మీరు నవ్వులపాలగుదురు. కనుక అర్జునునితో యుద్ధము చేయక దుర్యోధనుని రక్షించుటకు భీమునితో యుద్ధము చేయుమని పలికెను. శల్యుని మాటలు
ననుసరించి కర్ణుడు భీమునితో యుద్ధము చేయుటకు వెడలెను. యుధిష్ఠిరుని చూడవలెనని కోరికతో అర్జునుడు యుద్ధభారమంతయు భీమునిపై విడిచి అన్నగారివద్దకు వెళ్లెను. ఆసమయమున ధర్మరాజు కర్ణునిబాణములచే గాయపడి బాధపడుచుండెను. తనవద్దకు కృష్ణార్జునులు వచ్చుటచూచి ప్రసన్నుడై శ్రీకృష్ణునితో వాసుదేవా! కర్ణుడు పతాకమును విరగ్గొట్టి సారథి గుఱ్ఱములను చంపి ధృష్టద్యుమ్నుడు మున్నగువారు చూస్తుండగనే నన్ను జయించినాడు. కర్ణుడు నన్ను కేవలము బాణములతోనే కాదు మాటలతో కూడా బాధించినాడు. దుర్యోధనుని హితమాచరించవలెనని నిరంతరము ఆలోచించుచున్నాడు. అట్టి నరాధముని చంపెడి ఉపాయమును చెప్పమని కోరగా అర్జునుడు మీ ఆశీర్వచనంతో ఈరోజు యుద్ధమున తప్పక కర్ణుని జయించగలనని, తప్పక అతనిని చంపగలనని పలికెను.

అర్జునుడు ఈవిధముగా ప్రతిజ్ఞచేయగా శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో రాజా! అర్జునుడు కర్ణవధకు బయలుదేరినాడు. సోదరుని ఆశీర్వదించి

కర్ణవధకు అనుమతి నీయవలసినదని పలికెను. యుధిష్ఠిరుడు అర్జునుని ఆలింగనము చేసుకొని కర్ణవధకు అనుమతినిచ్చెను. అర్జునుడు యుధిష్ఠిరునితో సోదరా! ఎవరివలన మీరింత వ్యధపడుతున్నారో అట్టి పాపాత్ముడగు కర్ణుని ఈరోజు చంపెదను. తనపాపములకు కర్ణుడు ఈరోజు ఫలము ననుభవించుచున్నాడు. కర్ణుని చంపకుండా యుద్ధక్షేత్రమునుండి తిరిగిరానని ప్రతిజ్ఞచేసెను.

దుర్యోధనుడు యుద్ధమున భీముని చంపమని శకునికి చెప్పగా శకుని బాణములతో భీముని గాయపరచెను. శకునివలన పీడింపబడిన భీముడు కోపంతో అతనిసారథిని గుఱ్ఱములను చంపివేసెను. మరలశకుని ధనుస్సును విరిచి బాణములతో అతనిని బాధించెను. దుర్యోధనుడు రణభూమినుండి శకునిని దూరంగా తీసుకొని వెళ్లెను. ఈవిధముగా శకుని పరాజయం పాలుకాగా దుర్యోధనాదులు యుద్ధభూమిని విడిచివెళ్లిరి. ఇదిగమనించి కర్ణుడు పాండవసేనను చెల్లాచెదరు చేసెను. భీమునితో ఆలోచన చేసి అర్జునుడు కర్ణునితో తలపడుటకు బయలుదేరెను. అర్జునుని పరాక్రమమును చూచి కౌరవులు చింతాక్రాంతులైరి.

దుశ్శాసనుడు భీమునితో యుద్ధముచేస్తూ అతని ధనుస్సును ఖండించి సారథిని బాధించెను. కుపితుడగు భీముడు గదతో దుశ్శాసనుపై దాడిచేసెను. గదా ప్రహారములచే దుశ్శాసనుడు నేలపైబడెను. అతని సారథి, అశ్వములు చంపబడినవి. రథము భగ్నమైనది. భూమిపై బడిన దుశ్శాసనుని వద్దకు భీముడు వచ్చెను. అతడు
చేసిన అకృత్యములు స్మృతి పథమునకు రాగానే క్రుద్ధుడైన భీముడు దుర్యోధన, కర్ణ, కృపాచార్య, అశ్వత్థామలతో పాపియగు దుశ్శాసనుని చంపుచున్నాను. మీరతనిని రక్షించుకొనుడని చెప్పి ఖడ్గము తీసుకొని భుజములను నరికి వక్షఃస్థలము మీద బలముగా కొట్టి శిరస్సును ఖండించెను. మెడనుండికారు రక్తమును త్రాగి దోసిలితో రక్తమును గ్రహించి భయంకరముగ గర్జిస్తూ వీరులారా! దుశ్శాసనుని గూర్చి నేనుచేసిన ప్రతిజ్ఞను పూర్తిచేసితిని. దుర్యోధనుని చంపిరెండవ ప్రతిజ్ఞను పూర్తిచేసుకొందునని గర్జించెను. దుశ్శాసనుని మరణంతో కౌరవసేన భయపడి కర్ణుడు చూస్తూండగానే పారిపోయిరి. భీముని పరాక్రమమునకు కర్ణుడు కూడా భయపడెను. కర్ణ రథసారథి శల్యుడు రాధానందన! విచారించకుము. ఇది నీకు తగదు. భీముని పరాక్రమును చూచి

రాజులందరు పారిపోవుచున్నారు. సోదరుల మరణంతో దుర్యోధనుడు కూడా దిక్కుతోచక విచారంతోనున్నాడు. అర్జునాదులు తమ లక్ష్యం నెరవేర్చుకొని యుద్ధమునకై నీవైపు వచ్చుచున్నారు. దుర్యోధన పుత్రుడు యుద్ధభారమును నీమీద నుంచినాడు. కనుక క్షత్రియధర్మమును స్మరిస్తూ పురుషార్థంపై భారంవేసి అర్జునుని ఎదుర్కొనుమని ఉపదేశించెను. శల్యునిమాటలు విని గుండె దిటవుచేసుకొని కర్ణుడు యుద్ధమునకు సిద్ధమాయెను.

సంజయుడు ధృతరాష్ట్రునితో మహారాజా! కర్ణపుత్రుడు వృషసేనుడు భీముని ఆక్రమించగ అది గమనించి అర్జునుడు అతనిని ఎదుర్కొనెను. అర్జునుడు బాణములతో అతని మర్మభాగమును దెబ్బకొట్టి భుజమును, శిరస్సును ఖండించెను.

వృషసేనుడు మరణించగా పుత్రశోకంతో క్రుద్ధుడైన కర్ణుడు అర్జునునితో తలపడుటకు రథమును తీసుకువెళ్ళమని శల్యుని కోరెను. శల్యుడు రథమును అర్జునునికి ఎదురుగా నిలబెట్టెను. కర్ణార్జునులు ఒకరినొకరు ఎదురుపడుటచే రాజులందరు సింహనాదముచేసిరి. దుర్యోధన, సౌబల, కృపాచార్యాది మహారథులు అర్జునునిపై బాణవర్షముకురిపించగా అతడు వాటికి సునాయాసముగ వారించెను. యుద్ధమువలన వ్యాకులుడైన అశ్వత్థామ దుర్యోధనుని చేయిపట్టుకొని రాజా! యుద్ధభావము విడిచి పాండవులతో సంధి చేసుకొనుము. విరోధించుట వలన ఏమి ప్రయోజనము లేదు. పితామహుడు భీష్ముడు, అస్త్రవిద్యాపండితుడు ద్రోణాచార్యుడు ఈయుద్ధమున మరణించిరి. కృపాచార్యుడు అవధ్యుడు కనుక బ్రతికియున్నాడు. నరేశ్వరా! నామాటలు వినకపోయినచో తప్పక నీవు యుద్ధమున మరణించెదవు. ఆసమయమున నీవు పశ్చాత్తాపపడిననూ ప్రయోజనముండదు. కర్ణుడు అర్జునుని ఎట్టిపరిస్థితులలోనూ
జయించలేడని హితవుపలికెను. అశ్వత్థామ మాటలు విని దుర్యోధనుడు మిత్రమా! నీవు చెప్పినది అంతయూ నిజమే. కాని భీముడు అన్యాయముగ దుశ్శాసనుని వధించుట నాహృదయమును వేధించుచున్నది. ఇప్పుడు అర్జునుడు శ్రమతో అలసిపోయియున్నాడు. కనుక బలపూర్వకముగ అర్జునుని చంపగలడని పలికెను.

పిమ్మట కర్ణఅర్జునుల మధ్య ఘోరయుద్ధము జరిగెను. కర్ణుడు

భార్గవాస్త్రంతో పాంచాలురను వేధించెను. వారి బాధను చూసి భీముడు అర్జునునితో ఉపేక్షచేయక కర్ణుని వధింపమని సలహాచెప్పెను. శ్రీకృష్ణుడు అతని మాటలను సమర్థించెను. అప్పుడు అర్జునుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించగా కర్ణుడు వెంటనే బ్రహ్మాస్త్రముతో దానిని వారించెను. అర్జునుని చంపుటకు కర్ణుడు రౌద్రబాణమును ప్రయోగించెను. ప్రయోగించుటకు ముందే ఆబాణమున ఒకసర్పము ప్రవేశించియుండెను. విషజ్వాలలు వెదజల్లుచు మీదకువచ్చు బాణములను చూచి కృష్ణుడు అర్జునుని రథమును భూమిలోనికి దింపెను. దానివలన ఆబాణము అర్జునుని కిరీటమునకు మాత్రము తగిలి అది క్రింద పడెను. కర్ణుడు నాగరాజును మీరెవరని అడుగగా నాగరాజు నేను అర్జునుని శత్రువును. అతనిని చంపవలె ననుకొనుచున్నాను. కనుక మీకు సాయంచేసెదనని పలుకగా కర్ణుడు నేనే స్వయంగా అర్జునుని జయించగలనని చెప్పి నాగరాజు సహాయమును తిరస్కరించెను. అంతట నాగరాజు అర్జునునితో ఒంటరిగా పోరాడి అతని చేతిలో మరణించెను. కర్ణుడు భయంకరమగు బాణప్రయోగముచేయబోయెను. ఆ సమయమున రథము ఎడమవైపుచక్రము భూమిలో దిగబడెను. అదిచూచి కర్ణుడు విషాదమొందెను. అదే సమయమున అర్జునుడు కర్ణునిపై రౌద్రాస్త్రమును ప్రయోగించదలచెను. కన్నీళ్లతో కర్ణుడు పార్థా! భూమియందు దిగబడిన రథ చక్రమును పైకి తీసుకొనునంతవరకు నీవు నాపై అస్త్రప్రయోగముచేయుట ఉచితముగాదు. కనుక ముహూర్తకాలము వేచిచూడమని కోరగా జనార్దనుడు కర్ణా! ఏకవస్త్రయగు ద్రౌపదిని నీతో కూడా దుర్యోధన, దుశ్శాసన, శకునులు సభకు తీసుకువచ్చినప్పుడు ధర్మము ఏమయినదని ప్రశ్నించెను. శ్రీకృష్ణుని మాటలకు సిగ్గుపడి తలవంచుకున్న కర్ణుడు తిరిగి అర్జునునితో యుద్ధము చేయసాగెను. దివ్యాస్త్రముప్రయోగించి కర్ణుని వధించమని కేశవుడు అర్జునునికి సూచించెను. కర్ణుడు రథమునధిరోహించుటకు పూర్వమే దివ్యబాణంతో కర్ణుని శిరస్సు ఖండించెను. కర్ణవధతో పాండవులు హర్షధ్వనులు చేసిరి. కౌరవసేనలో భయవిషాదములు అలముకొన్నవి. వారు అటునిటు పారిపోయిరి. దుర్యోధనుడు స్వయంగా సేనను ఆపుటకు ప్రయత్నించెను.

సంజయునివలన కర్ణవధ వృత్తాంతమువిని ధృతరాష్ట్రుడు శోకసంతప్తుడాయెను. గాంధారి కూడ విలపించెను. శోకసాగరంలో

మునిగిన ధృతరాష్ట్రుని సంజయుడు, గాంధారిని విదురుడు ఓదార్చిరి.

**ఇది కర్ణపర్వ కథాంశము.**